క్లుప్తంగా

మార్మోగిన రామనామస్మరణ


ఉత్సవ విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో శ్రీకోదండ సీతారామస్వామి ఆలయ ప్రారంభోత్సవం పురస్కరించుకుని, రామనామస్మరణ మార్మోగింది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం ఖండ్యాం గ్రామానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త అంపోలు రుద్రకోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిశ్చత్ ప్రాయశ్చిత్తం, రక్షాసూత్రాధారణ, పంచగవ్యప్రాసన, రుత్విక్ వరుణ, అఖండ దీపారాధన, జలాధివాసం, మంత్రపుష్పాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వంటి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామ పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరగ్గా, గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శిశుమందిర్ వార్షికోత్సవం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని శిశుమందిర్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు హాజరై, విద్యార్థులను ఉద్దేశించి, కాసేపు మాట్లాడారు. చదువుతో పాటు అన్నిరంగాల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పెంట స్వామినాయుడు, డాక్టర్ డి.వి.వి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

తెర్లాం: మండలంలోని విజయరాంపురంలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా శనివారం యజ్ఞ, హోమాలు, కుంకుమ పూజలు, విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు కూడా అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని, గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

వంగర: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజనీదుర్గ, నూకాలమ్మ అన్నారు. ఎం.సీతారాంపురం, వంగర సెక్టార్ల పరిధిలోని వంగర, నీలయ్యవలస అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పక్షోత్సవాలు శనివారం నిర్వహించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూడాలన్నారు.

వాహన తనిఖీలు

వంగర: మండల పరిధిలోని మగ్గూరు జంక్షన్‌లో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేశారు. వాహనాలు, వాహనదారుల లైసెన్స్‌లకు సంబంధించి, ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఎస్ఐ వై.వి.జనార్దన్ సూచించారు.

ప్రతిఒక్కరూ బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలి

రేగిడి: ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్‌ను తెలుసుకోవాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాజాం ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్ సూచించారు. శనివారం మండలంలోని మునకలవలస గ్రామంలో రాజాం జీసీఎస్ఆర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా శిబిరంలో రక్త గ్రూపులు తెలుసుకోవడంపై అవగాహన కల్పించారు. అనంతరం రెడ్ క్రాస్ రుధిర ద్వారా గ్రామస్తులతో పాటు విద్యార్థులకు రక్త పరీక్షలు చేసి, గ్రూపు వివరాలు తెలిపారు. కార్యక్రమంలో పీవో తురంగి విశ్వనాథం, స్థానిక పాఠశాల హెచ్ఎం కాటం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బాడంగి: మండలంలోని పినపెంకి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. లోవోల్టేజీ కారణంగా సబ్‌స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండడంతో పినపెంకి, రేజేరు, ఆనవరం, అల్లుపాల్తేరు, హెచ్.పాల్తేరు, పాల్తేరు, వాడాడ, జి.కె.ఆర్.పురం, కోటిపల్లి, ఆకులకట్ట, గూడెపువలస, అల్లువానివలస గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎ.అనంతరావు తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా పట్టణ పరిధిలోని నాయుడుకాలనీ, ఆర్‌టీసీ కాంప్లెక్స్, గాంధీబొమ్మ ప్రాంతాలతో పాటు వెలమవారి వీధి, పార్క్ ఏరియా, టీటీడీ కల్యాణ మండపం ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. ఈ అసౌకర్యాన్ని గుర్తించి, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

అభివృద్ధి పథంలో రుషింగి

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చొరవతో గ్రామంలో జోరుగా అభివృద్ధి పనులు
- రూ.27.50 కోట్ల నిధులతో రుషింగి వంతెన నిర్మాణం
- మరో రూ.70 లక్షలతో ప్రభుత్వ భవనాలు, రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణం
- మౌలిక సదుపాయాలు మెరుగుపడడంతో ఆనందంలో గ్రామస్తులు


రుషింగి వద్ద నాగావళి నదిపై నిర్మించిన కొత్త వంతెన

వంగర: మండలంలోని రుషింగి గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. గత పాలకులు గ్రామాభివృద్ధిని గాలికి వదిలేయగా, కొత్తగా ఏర్పడిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాన్ని అంచెలంచెలుగా అభివృద్ధి చేసింది. కొప్పరవలస సచివాలయం పరిధిలోని రుషింగి గ్రామపంచాయతీలో 1650 మంది జనాభా, 1100 మంది ఓటర్లున్నారు. సర్పంచ్ యలకల భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నేత, న్యాయవాది యలకల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టారు. 2019లో ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికైన తర్వాత గ్రామంలో 35 కొత్త పెన్షన్లు మంజూరు చేయగా, అమ్మఒడి పథకం ద్వారా 110 మందికి లబ్ధి చేకూరింది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మరో 119 మందికి లబ్ధి చేకూరగా, జగనన్న విద్యాదీవెన ద్వారా 40 మంది, జగనన్న చేదోడు ద్వారా 19 మందికి లబ్ధి చేకూరింది. 250 మందికి పైగా మహిళలకు రుణమాఫీ వర్తించడంతో పాటు సున్నావడ్డీ పథకం కూడా అమలు చేసి, మేలు చేశారు. 300 మందికి రైతు భరోసా పథకం వర్తింపజేశారు. నిరుపేదలకు గృహాలు మంజూరు చేశారు. దీంతో పాటు గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌ల ద్వారా అధిక మొత్తంలో రూ.70 లక్షలు నిధులు కేటాయించి, గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

రుషింగి గ్రామం.. రాజమార్గం..

వంగర మండలంలోని రుషింగి, వీరఘట్టం మండలంలోని కిమ్మి గ్రామాల మధ్య నాగావళి నదిపై రూ.27.50 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టారు. ఈ వంతెనను ఇటీవల కాలంలో మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. ఎన్నో ఏళ్లుగా నిలిచిన ఈ వంతెన నిర్మాణం ఇప్పుడు పూర్తి కావడంతో రుషింగి గ్రామం రాజమార్గమైంది. రవాణా సౌకర్యం మెరుగుపడింది.

ఇదిలా ఉండగా, అంగన్‌వాడీ కేంద్రం నుంచి తూముల రామలింగడు ఇంటి వరకు రూ.75 వేలతో కల్వర్టు నిర్మాణం, గూలవీధిలో యలకల శశిభూషణరావు ఇంటి నుంచి దాసరి గుంపడు ఇంటి వరకు మరో రూ.75 వేలతో కల్వర్టు నిర్మాణం, దాసరి గోవింద ఇంటి నుంచి బెవర చిన్నయ్య ఇంటి వరకు రూ.75 వేలతో ఇంకో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. చాకలి వీధిలో అజ్జాడ అప్పారావు ఇంటి నుంచి బోయన శంకర్ ఇంటి వరకు రూ.35 వేలతో సీసీ రోడ్డు, ఎస్టీ వీధిలో పెదకాపు బోడమ్మ ఇంటి నుంచి సిమ్మన్నదొర ఇంటి వరకు రూ.50 వేలతో సీసీ రోడ్డు, ప్రధాన వీధిలో రూ.3.20 లక్షలతో గులిపల్లి విజయలక్ష్మి ఇంటి నుంచి చీమల శివున్నాయుడు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేశారు. అలాగే రాజులగుమ్మడ రోడ్డు నుంచి షిర్డీసాయిబాబా గుడి వరకు రూ.3.20 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణం చేపట్టగా, పుర్రి లక్ష్మణ ఇంటి నుంచి శీలంకి రామకృష్ణ ఇంటి వరకు రూ.3.20 లక్షలతో సీసీ రోడ్డు, తాడేల శ్రీరాములు ఇంటి నుంచి గండేటి గోపి ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇలా అన్ని వీధులనూ అభివృద్ధి చేశారు.

మరిన్ని అభివృద్ధి పనులు..

నాగావళి నది వద్ద రూ.20 వేలతో మెట్లు నిర్మాణం చేపట్టగా, రూ.50 వేలతో కొప్పరవలస నుంచి రుషింగి జంక్షన్ వరకు గ్రావెల్ రోడ్డు నిర్మించారు. రూ.50 వేలతో శ్మశానవాటికకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం, మరో రూ.22 లక్షలతో ఇంటింటా తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. రూ.5 లక్షల ఎంపీ నిధులు, గ్రామ పంచాయతీ నిధులతో వంతెనపై ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు, విద్యుత్ లైన్ ఏర్పాటు, వంతెన నుంచి మెయిన్‌రోడ్డు వరకు విద్యుత్ లైన్ ఏర్పాటు చేపట్టారు. నాడు-నేడు పనుల్లో భాగంగా రుషింగి ప్రభుత్వ పాఠశాలను రూ.20 లక్షలతో ఆధునీకరించారు.


మెయిన్ వీధిలో నిర్మించిన సీసీ రోడ్డు


ఊరి చివరి వీధిలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణం


నాడు-నేడు నిధులతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాల


నాగావళి నది వద్ద మెట్లు నిర్మిస్తున్న దృశ్యం


కొత్తగా వేసిన సీసీ రోడ్డు

అభివృద్ధి చేసి చూపించాం..



మా గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపించాం. గత పాలకులు గ్రామాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయకపోవడంతో సమస్యలు తిష్టవేశాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రావెల్ రోడ్లు, ఇంటింటా కుళాయిలు ఏర్పాటు చేశాం. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాల రూపురేఖలు మార్చాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్నివర్గాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగింది.

–యలకల భాగ్యలక్ష్మి, సర్పంచ్, రుషింగి.

దీర్ఘకాల సమస్యలు పరిష్కారం..



రుషింగిలో దీర్ఘకాలంగా తిష్టవేసిన సమస్యలు పరిష్కరించాం. గ్రామపంచాయతీ, మండల పరిషత్ నిధులతో పాటు ఎంపీ నిధులతో ప్రజలకు అవసరమైన అన్ని పనులు చేశాం. గ్రామస్తుల దశాబ్దాల కల అయిన వంతెన నిర్మాణం ఇప్పుడు నెరవేరింది. ఈ ప్రభుత్వంలో అంతా మంచి జరగడంతోనే ఇంటింటికీ వెళ్లి, ధైర్యంగా ఓటు వేయమని అడగగలుగుతున్నాం.

–యలకల శ్రీనివాసరావు, న్యాయవాది, రుషింగి.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- రానున్న ఎన్నికల్లోనూ ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం
- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్


వంగర: పార్టీలో చేరిన వారితో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

వంగర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని వి.వి.ఆర్.పేట, జె.కె.గుమ్మడ, పెదరాజులగుమ్మడ, చినరాజులగుమ్మడ, రుషింగి, కొప్పరవలస, బంగారువలస గ్రామాల్లో శనివారం పర్యటించిన వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. వైఎస్సార్ సీపీకి ప్రజల్లో విశేష ఆదరణ ఉందని, ఏ గ్రామం వెళ్లినా ప్రజల నుంచి తమకు లభిస్తున్న ఆదరాభిమానాలే దానికి నిదర్శనమన్నారు. ప్రతీ ప్రాంతం అభివృద్ధి చెందేలా పనులు చేయిస్తూ ప్రతీ వ్యక్తి సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్న ఏకైక నాయకుడు మన జగనన్న అని, ఆయనకు మనమంతా అండగా నిలవాలన్నారు. పేదల బతుకులను బాగుచేస్తున్న జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి రావాలన్నారు. ఎన్నికల వేళ చంద్రబాబు ఆడే మాయమాటలను మరోసారి నమ్మి మోసపోవద్దని ప్రజలను కోరారు. రాష్ట్రంలోని పేద ప్రజలు ధైర్యంగా, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కావాలని పార్వతీపురం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు ద్వారపురెడ్డి రామ్మోహనరావు అన్నారు.

టీడీపీని వీడి..వైఎస్సార్ సీపీలోకి..

మండల పరిధిలోని పెదరాజులగుమ్మడ గ్రామంలో నివాసముంటున్న కుటుంబాల్లో 40 కుటుంబాల వారు టీడీపీని వీడి, వైఎస్సార్ సీపీలో శనివారం చేరారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్ సమక్షంలో చేరిన వార్డు మెంబరు దండాసి గౌరి, గొటివాడ శ్రీను, దార గంగులు, గొటివాడ గుంపస్వామి, శ్రీనివాసరావు, జయమ్మ, అల్లిన గౌరమ్మ తదితర కుటుంబాల వారికి పార్టీ కండువాలు వేసి, సాదర స్వాగతం పలికారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారికి సదరు నేతలు సూచించారు. పార్టీ విధివిధానాలు నచ్చడంతో పాటు ప్రజలకు సీఎం జగనన్న చేస్తున్న మేలును చూసి, ఆకర్షితులై తామంతా పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, మండల జేసీఎస్ కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు మరిచర్ల విజయలక్ష్మి, సర్పంచ్‌లు యలకల భాగ్యలక్ష్మి, ద్వారపురెడ్డి ఉషారాణి, సాదెం లలితకుమారి, బత్తిన గురువులు, దారపురెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఆశీర్వదిస్తే మరింత సంక్షేమం అందిస్తాం


గిరిజన గ్రామాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ తమను(ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు), వైఎస్సార్ సీపీని మళ్లీ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకువస్తే మరింత అభివృద్ధి, సంక్షేమం అందిస్తామని, అందరికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని దిబ్బగుడ్డివలస పంచాయతీ పరిధిలో ఉన్న నిమ్మలపాడు, కొయ్యకొండవలస, సిముడుగుడ్డివలస, చెల్లయ్యవలస, కేశాయవలస, కొత్తవలస గ్రామాల్లో శనివారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. తమ ప్రభుత్వం వల్ల మంచి జరిగితేనే ఓటు వేయండి అని ఓట్లు అడుతున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో టీడీపీ ఇచ్చిన హామీల్లో కనీసం 10 శాతం కూడా ఆ పార్టీ నెరవేర్చకపోవడంతోనే వెబ్‌సైట్ నుంచి ఆ పార్టీ మేనిఫెస్టోను మాయం చేశారని విమర్శించారు. సీఎం జగనన్న అలా కాదని, ఆయన ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతానికి పైగా హామీలు నెరవేర్చి, ప్రజలను ధైర్యంగా ఓట్లు అడుగుతున్నారన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు సైతం అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకే మళ్లీ ఓటు వేసి, తమను, పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వేలంగిణి, మాజీ సర్పంచ్ సాంగల రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ మరిపి దువ్వి నాయుడు, మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు తేలు గోపాల్, కునుకు శ్రీరాములు, రెడ్డి త్రినాథ, బొత్స శంకరరావు, బొమ్మి త్రినాథ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం

రామభద్రపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం తొలిసారిగా కల్పిస్తోందని తహసీల్దార్ ఎ.సులోచనరాణి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆమె శనివారం పర్యటించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలో మొత్తం 846 మంది 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారని, రానున్న ఎన్నికల్లో వీరంతా ఇంటి నుంచే ఓటు వేయొచ్చని తెలిపారు. అయితే ఈ అవకాశం కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫారం-12డి నింపి రిటర్నింగ్ అధికారికి గానీ సహాయ రిటర్నింగ్ అధికారికి గానీ పంపించాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబర్‌ను అందులో తప్పనిసరిగా రాయాలన్నారు. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

బాడంగి: మండలంలోని పిన్నవలస, బాడంగి, కోడూరు గ్రామాల్లో కేంద్ర భద్రతా బలగాలతో కలిసి పోలీసులు శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడమే లక్ష్యంగా ఈ ఫ్లాగ్‌మార్చ్ చేపడుతున్నామని బొబ్బిలి సీఐ తిరుమలరావు తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడతారనే అనుమానిత వ్యక్తులపై బైండోవర్ కేసులు కూడా నమోదుచేసి, మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.జయంతి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల ఆశయ సాధనకు కృషి

బొబ్బిలి: స్వాతంత్య్ర సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం అన్నారు. స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి శనివారం నిర్వహించి, వారి త్యాగాలను కొనియాడారు. మహనీయుల జీవిత చరిత్రలు తెలుసుకుని, వారిలోని మంచిని స్ఫూర్తిగా తీసుకుని జీవించాలన్నారు.

బొబ్బిలి జనసేనలో గందరగోళం

బొబ్బిలి: నియోజకవర్గం జనసేన పార్టీలో నెలకొన్న గందరగోళం జనసైనికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇదే పార్టీ నుంచి గిరడ అప్పలస్వామి, పాలూరి బాబు వేర్వేరుగా పార్టీ కార్యాలయాలు నిర్వహిస్తూ ప్రచారం కొనసాగిస్తుండడం విమర్శలకు తావునిస్తోంది. ఎక్కడైనా సీటు కోసం పోట్లాడుకుంటారు కానీ ఇక్కడ మాత్రం టీడీపీకి మద్దతు ఇవ్వడానికి తన్నుకుంటున్నారేంటని విమర్శిస్తున్నారు. ప్రజారాజ్యం నుంచి జనసేనకు జంప్ అయిన గిరడ అప్పలస్వామి బొబ్బిలిలో జనసేన తరఫున తిరుగుతున్నారు. అయితే జనసేన పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ఉన్న పార్వతీపురం నియోజకవర్గం, బలిజిపేటకు చెందిన పాలూరి బాబు బొబ్బిలి మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మరో కార్యాలయం ఏర్పాటు చేసుకుని, పార్టీ కార్యక్రమాలు, ప్రచారం కొనసాగిస్తున్నారు. ఇటీవల బొబ్బిలి టీడీపీ అభ్యర్థి బేబినాయన ప్రచారంలో కూడా పాలుపంచుకున్నారు. గ్రంథాలయ నిరాహార దీక్ష కూడా చేశారు. అయితే ఈయనను ఇక్కడి జనసేన నేతలు గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ, జనసైనికులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇటీవల పార్వతీపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ మోహనరావుతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మరీ, పాలూరి బాబును చెడామడా ఏకిపారేశారు కూడా. అతడు అసలు రాష్ట్ర ప్రచార కార్యదర్శి కాదని, మరొకరున్నారని, అతడిది పాత పదవని స్పష్టం చేశారు. అతడిని పార్టీ నుంచి తొలగిస్తామని, జనసైనికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఒక కూటమిగా ఏర్పడి, పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. వీరి కూటమిలో ఓ పార్టీ అయిన బీజేపీ ఇక్కడ సైలెంట్‌గా ఉండగా, మరో కూటమి పార్టీ అయిన జనసేనలో రెండు వర్గాల్లో ఉన్న విభేదాలు ఇక్కడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయనకు కొత్త తలనొప్పిని తీసుకువస్తున్నాయి. వారి తీరు చూసి, మాకు మద్దతు ఇవ్వడానికా.. మమ్మల్ని ముంచడానికా అని బేబి నాయన మదనపడుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఎన్నికల నియమావళి పాటించాలి


రాజాం: రాజకీయ పార్టీల నేతలతో సమీక్షిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ జోసెఫ్

రాజాం: సార్వత్రిక ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులంతా ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎల్.జోసెఫ్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశమైన ఆయన ఎన్నికల నియమావళి అమలుపై సమీక్షించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రచారాలకు అనుమతులు పొందాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్న ఏజెంట్ల వివరాలను ముందుగా సిద్ధం చేసుకోవాలని, వాటిని తమ పోలింగ్ అధికారులకు తెలియజేయాలన్నారు. అనుమతులు లేకుండా ప్రచారాలు, సభలు పెడితే నిబంధనలు ఉల్లంఘించినట్లేనని, కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎదుట వ్యక్తులు, పార్టీలను కవ్వించేలా ప్రచారాలు చేయరాదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల ఆర్వో ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ బి.ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని రాజాం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎల్.జోసెఫ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పైడితల్లి, తహసీల్దార్ తిరుమలరావు, మండలానికి చెందిన పలువురు అధికారులతో శనివారం సమావేశమైన ఆయన.. గ్రామాల్లోని సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగా గుర్తించి, అక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

బాడంగి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు సహాయ ఎన్నికల అధికారి ఎస్.రాజారావు తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన కొత్తగా ఓటరుగా నమోదుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉందని, ఆన్‌లైన్‌లో గానీ ఆఫ్‌లైన్‌లో గానీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల వేళ ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామాల్లో చర్యలు చేపడుతున్నామన్నారు.

తెర్లాం: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, గ్రామాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీవో బి.మధుసూదనరావు సూచించారు. మండల కేంద్రంలో మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్(ఎంసీసీ) అమలుపై సంబంధిత అధికార బృందంతో శనివారం సమావేశమై, మాట్లాడిన వారు.. గ్రామాల్లో ఎక్కడా పార్టీలకు చెందిన జెండాలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో గానీ, గోడపై గానీ సీఎం, పీఎం, మంత్రుల ఫొటోలు, వాల్‌పోస్టర్లు లేకుండా చూడాలని, దీనికి అన్ని రాజకీయ పార్టీల నాయకులంతా అధికారులకు సహకరించాలని కోరారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టిసారించాలి

రాజాం సిటీ: నియోజకవర్గంలోని సమస్యాత్మక గ్రామాలపై సిబ్బంది దృష్టిసారించాలని చీపురుపల్లి డీఎస్పీ ఎ.శ్రీనివాస చక్రవర్తి అన్నారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి ఎస్ఐలు, సిబ్బందితో శనివారం సమావేశమైన ఆయన.. సమస్యాత్మక, అతిసమస్యాత్మక గ్రామాలను గుర్తించి, ఆయా గ్రామాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడి ఓటర్లు ధైర్యంగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ మహేంద్ర, రాజాం టౌన్, రూరల్ సీఐలు డి.మోహనరావు, ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

రాజాం సిటీ: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు హెచ్చరించారు. స్థానిక నైటింగేల్ నర్సింగ్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయొద్దని చదువే ముద్దు అని అన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, కుల, మత, లింగ వివక్ష చూపరాదని, అంటరానితనం నేరమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రెడ్డి విజయ్‌కుమార్, ముదిలి శ్రీనివాసరావు, ఏవో జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.